క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కేశంపేట: మిత్రుడి అకాల మరణం జీర్ణించుకోని తోటి మిత్రులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో డప్పు శివకుమార్ జ్ఞాపకార్థం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ వారి సహకారంతో మైత్రి యువజన సంఘం సభ్యులు గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 22 మంది యువకులు శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ రాజుతో పాటు గ్రామ యువకులు మనోహర్‌గౌడ్, మల్లేశ్, కృష్ణ, ప్రశాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత

షాద్‌నగర్: నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బసిరెడ్డి పద్మ దంపతులు ఆదివారం పుస్తె, మెట్టెలు అందజేశారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన తుపాకుల మల్లయ్య కూతురు శ్రావణి వివాహానికి గాను దంపతులు పుస్తె, మెట్టెలు అందజేశారు.

సంతకాల సేకరణ



సంతకాలు చేసిన దివ్యాంగులు

కేశంపేట: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు చట్టం తీసుకురావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల ఉపాధ్యక్షుడు యాదయ్య అన్నారు. దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో చట్టం సాధనకు లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో దివ్యాంగులు సంతకాల సేకరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదయ్య పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో దివ్యాంగులు 12.02 శాతం మంది ఉన్నారని, స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు నామినేటెడ్ పదవులను ఇచ్చేందుకు చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. దివ్యాంగులకు ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు నామినేటెడ్ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. దివ్యాంగులకు నామినేటెడ్ పదవులను ఇవ్వడంతో 26,968 మందకి అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు. ఇలా ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు అకుల రాంచంద్రయ్య, శంకరయ్య, మల్లయ్య, పాష, రఘు, అంజనేయులు, బాలరాజ్, శంకరయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్: మండల పరిధిలోని హైతాబాద్‌లో ఉన్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యలు రాకుండా 5ఎంవీఏ తొలగించి 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చే ప్రక్రియలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ పరిధిలోని హైతాబాద్, ఐతాబాద్ తండా, మద్దూర్, పెద్దవేడు, పెద్దవేడు తండా, దూసరకుంట తండా, అంకిరెడ్డిగూడ, దామర్లపల్లి, నాందర్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గల్లంతు

బీజేపీ చేవెళ్ల ఓబీసీ కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నిధులు కేటాయిస్తే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పండుగ చేసుకుంటున్నారని బీజేపీ చేవెళ్ల ఓబీసీ కన్వీనర్ ఎలిగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన హిమాయత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపెట్టాలని సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు ఇస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో నాయకులు పండుగ చేసుకుంటున్నారన్నారు. ప్రజలకు నిజాలు తెలిసినప్పుడు బీఆర్‌ఎస్‌కు పట్టిన గతి కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు. స్థానిక ఎన్నికలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లడం లేదని, ఎలక్షన్ ఎప్పుడు నిర్వహించిన రాష్ట్రంలో బీజేపీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గల్లంతు కావడం ఖాయమన్నారు.

స్థానిక ఆశ.. ఖర్చుల గోస!

- ఆరునెలలుగా మందీమార్బలంతో నేతల హంగామా
- ఎన్నికల వాయిదాలతో దిక్కుతోచని పరిస్థితి
- కేడర్‌ను కాపాడుకునేందుకు నాయకుల తంటాలు
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు



ఎంపీడీఓ కార్యాలయం

కొత్తూరు: ఖద్దరు దుస్తులు.. ఖరీదైన చెప్పులు, బూట్లు, తిరగడానికి కార్లు.. పదుల సంఖ్యలో అనుచరులు. డబ్బులు ఉన్నా.. లేకపోయినా ప్రస్తుత రాజకీయంలో రాణించాలనుకునే వారు ఇవన్నీ మెయింటెన్ చేయాల్సిందే. వ్యవహారంలో ఏమాత్రం తేడా వచ్చిన సొంత కేడర్‌తో పాటు ప్రత్యర్థి వర్గం ముందు చులకన అవుతామనే భయం. అందుకే అప్పులు చేసైనా, ఆస్తులు అమ్మి అయినా దర్పం ప్రదర్శిస్తున్నారు. ఈ రాజకీయ చదరంగంలో పరిస్థితులు తారుమారై మండలంలో ఎంతోమంది రాజకీయ నాయకులు ఖద్దరు చాటున కన్నీళ్లు పెడుతూ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారు.

ఆశావహుల కష్టాలు

మండలంలో 12 గ్రామ పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాలు, సుమారు 20 వేల జనాభా ఉన్నారు. 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు జరగగా.. గెలుపొందిన వారికి 2024 జనవరి 31తో పదవీ కాలం ముగిసింది. ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు సైతం 2019 జూన్‌లో జరగగా 2024 జూన్ 03 వీరి పదవీకాలం ముగిసింది. కాగా అప్పటికే పదవీకాలం ముగిసిన వారితో పాటు కొత్త ఆశావాహులు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీగా బరిలో ఉండడానికి సిద్ధమై కేడర్‌ను బలోపేతం చేసుకున్నారు. ఇంతలో ఎన్నికలు వాయిదా పడడంతో కొంతమేర రాజకీయ ఖర్చులు తగ్గించుకున్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన తర్వాత తిరిగి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుందనే ప్రచారం ఊపందుకోవడంతో ఆశావాహులు తమ తమ కేడర్లను ప్రసన్నం చేసుకోవడానికి విందులు ఏర్పాటు చేశారు. మరి కొందరు విహార యాత్రలకు పంపారు. ఎన్నికలు వరుసగా వాయిదా పడుతున్నప్పటికీ ఆశావాహులు మాత్రం కేడర్లకు అందుబాటులో ఉంటూ ఖర్చులు భరిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నాయకులు

మండలంలో చాలా మంది నాయకులు రియల్ రంగాన్ని నమ్ముకున్న వారే. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం గత ఏడాదిన్నరగా ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. దీంతో రాజకీయ రంగంలో రాణించాలనుకుంటున్న నాయకులు ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో ఉండాలనుకుంటున్న ఆశావాహులు తమ కేడర్లను కాపాడుకోవడానికి ఖర్చులు చేస్తూ అప్పుల పాలవుతున్నారు. మరి కొంత మంది ఎన్నికల్లో పోటీ ఉండడానికి ఆస్తులు తనాఖా పెట్టి అప్పులు తీసుకుంటూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

మండలంలో ఓటర్ల వివరాలు

గ్రామ పంచాయతీలు	-	12
మొత్తం ఓటర్లు	-	16,713
పురుషులు	-	8,394
మహిళలు	-	8,318
ఇతరులు	-	01
ఎంపీటీసీ స్థానాల సంఖ్య	-	06
జెడ్పీటీసీ స్థానాలు	-	01
పంచాయతీ వార్డులు	-	110
పోలింగ్ కేంద్రాలు	-	110

దైవచింతనతో మానసిక ప్రశాంతత



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్, నాయకులు

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ ఎల్లగమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు, భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీందర్‌యాదవ్ బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వామివారి కృప ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. మన సంప్రాదాయలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, జమాల్‌ఖాన్, యాదగిరిరావు, యాదగిరి, కృష్ణయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, సాజిద్, వేణుగోపాలచారి, ద్రోణాచారి, బాబు, భాస్కర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



మాట్లాడుతున్న యాదయ్య

షాద్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పగడాల యాదయ్య మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీస్తామని, పేదల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని చెప్పి బీజేపీ ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. అదేవిధంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా నెరవేర్చడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాలు బడా కార్పోరేట్ పారిశ్రామిక వేత్తలకు ఎర్రతివాచీ పరిచి వారికి అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. అదేవిధంగా రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయని ఫలితంగా పేదల కొనుగోలుచేసే శక్తి తగ్గుతుందన్నారు. పెరుగుతున్న ధరలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి రాజు, నాయకులు బీస సాయిబాబ, ఈశ్వర్‌నాయక్, కుర్మయ్య, పద్మారెడ్డి, బేరి శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- మహోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



సదర్ పటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, శివసత్తుల పూనకాలతో మల్లికార్జునస్వామి ఉత్సవాలు రెండోరోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం మల్లికార్జునస్వామి దేవాలయంలో మాఘమాస బహుళ చవితి సదర్ పట్టం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఒగ్గు పూజారులు కనుల విందుగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులందరికీ యాదవ సంఘం సభ్యులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



బోనాల ఊరేగింపు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కొందుర్గు: మండల కేంద్రంలోని ఈగల్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో కొందుర్గు ఉన్నత పాఠశాల, చౌదరిగూడ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. బాలికల ఫైరింగ్ విభాగంలో కొందుర్గు విద్యార్థులు నహీద్ ద్వితీయ స్థానం సాధించగా, జూనియర్ బాలుర విభాగంలో ఎండీ మ్యూజిత్ తృతీయ స్థానం సాధించారు. అదేవిధంగా పటాస్ సీనియర్ విభాగంలో చౌదరిగూడ కస్తూర్బా విద్యార్థి వైష్ణవి ద్వితీయ స్థానం జూనియర్ విభాగంలో సంధ్య, అక్షిత, ఇందు, ప్రియ తృతీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఫైరింగ్ విభాగంలో అమూల్య, మంజుల తృతీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అభినందించారు.

కరాటేతో ఆత్మరక్షణ

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: కరాటే సాధన చేసే వారిలో ఆత్మస్థైర్యం మరింత పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం షోటోఖాన్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో భాగంగా గెలుపొందిన విద్యార్థులకు ఆయన బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ సాధన చేసే వారిలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. భవిష్యత్‌లో ఆర్మీతో పాటు పోలీసు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. యువత, విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దేవేందర్ యాదవ్, రాజేందర్‌గౌడ్, యాదయ్య, బాలరాజు, రాఘవేందర్‌యాదవ్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాఫాహిల్స్‌లో ఇఫ్తార్



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని ముస్తాఫాహిల్స్ కాలనీలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చారు. నమాజ్ అనంతరం భోజనాలు ఏర్పాటు చేసినట్లు ముస్తాఫహిల్స్ కాలనీవాసులు పేర్కొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు



షాద్‌నగర్: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 17వ వార్డులో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.10లక్షల వ్యయంతో యమ్మి బేకరీ నుంచి హనుమాన్ దేవాలయం వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలైన సీసీరోడ్డు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, మంచినీటి వసతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన విధంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, బాబర్‌ఖాన్, సర్వరపాషా, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బస్వం, జమృద్‌ఖాన్, అప్పి, షఫీఖాన్, ఖాదీర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సబ్బండ వర్గాల అభివృద్ధి

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్‌డీఎఫ్ నిధులతో మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గ్రంథాలయ భవనం, ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమిపూజ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలోని గుంటుక లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

కార్యకర్తకు నివాళి

మండల పరిధిలోని అల్వాల గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త సత్తయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి రూ.5వేల చొప్పున, బిల్లు నాయక్, బండాలి నరేశ్, మద్దురి మధుసూదన్ రూ.2వేల చొప్పున్న ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, తైద పర్వతాలు, కోడూరు రాములు, శివయ్య, గ్యార సురేశ్, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాములు



పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాములు తదితరులు

మొయినాబాద్: సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు అన్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లిలో రూ.5లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. అభివృద్ధిలో భాగంగా ఇటీవల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీ కాలనీల అభివృద్ధికి విడుదల చేసిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్నీ నిధులతో అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కిరణ్‌కుమార్, నాయకులు దినేశ్, తైదల రాజు, ఇ.సునీల్, ఇ.కాంతరాజు, కె.అంతయ్య, ఎర్ర శ్రీకాంత్, పి. భాస్కర్, పి.పట్వారి, జి.మల్లేశ్, వై.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌కు కారణాల గుర్తింపు



షాపుల ఎదుట పెట్టిన బోర్డులు, బండికొట్లు తొలగించాలని నిర్వాహకులకు చెబుతున్న ట్రాఫిక్ పోలీసులు

రోడ్లకిరువైపులా బండికొట్లు తీసివేయాలని సీఐ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడానికి రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న దుకాణ సముదాయాలు, బండికొట్లే కారణమని ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. మొయినాబాద్‌లో ట్రాఫిక్ జామ్, పార్కింగ్ సమస్యపై ఆదివారం ట్రా'ఫికర్' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఆదివారం ఉదయం ట్రాఫిక్ సీఐ రాజేందర్‌గౌడ్ సిబ్బందితో మొయినాబాద్ మున్సిపల్ కేంద్రాన్ని సందర్శించారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్‌కు కారణాలను గుర్తించారు. రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న దుకాణ సముదాయాల ముందు పార్కింగ్ స్థలం వదలకుండా బోర్డులు, సామాన్లు పెట్టడంతో కొనుగోళ్లకు వచ్చిన వారు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారని, తద్వారా ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు, బండికొట్ల నిర్వాహకులతో మాట్లాడి రోడ్డుకు దగ్గరగా ఉన్న బోర్డులు, వస్తువులు, బండికొట్లను తీసివేయాలని ఆదేశించారు. తీసివేయడానికి రెండు రోజుల సమయం ఇచ్చారు. రెండు రోజుల్లో తీయకపోతే మున్సిపల్ అధికారులతో కలిసి నోటీసులు ఇచ్చి జేసీబీలతో తొలగిస్తామని హెచ్చరించారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటం

మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమీద



మాట్లాడుతున్న ఎండీ ఫైమీద

మొయినాబాద్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను ప్రభుత్వాలు అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఫైమీద డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో భారత జాతీయ మహిళా సమాఖ్య మండల రెండో మహాసభ ఆదివారం జరిగింది. ఈ మహాసభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా మహిళలకు రక్షణ కరువైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవి మహిళలకు అందడం లేదన్నారు. మహిళా హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారం కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య పోరాడుతోందన్నారు. అన్ని గ్రామాల్లో సంఘాన్ని విస్తరించి మహిళలను చైతన్య పర్చాలన్నారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల నూతన మహిళా కమిటీని ఎన్నుకున్నారు. ఈ అధ్యక్షురాలిగా మమత, కార్యదర్శిగా మాధవి, ఉపాధ్యక్షురాలుగా బాలమణి, అనురాధ, సహాయ కార్యదర్శులుగా వెంకటమ్మ, పెంటమ్మ, శంకరమ్మ, సైజాదిబేగం, రాములమ్మ, చంద్రమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు మంజుల, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.